క్లుప్తంగా

వేసవిలో తాగునీటి సమస్య రానీయొద్దు



సూచనలు చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలో వేసవిలో తాగునీటి సమస్య నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని కార్యదర్శులతో సమావేశమై ఆయన పలు సూచనలు చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు, కుళాయిల నిర్వహణ తదితర విషయాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఏమైనా సమస్యలు తలెత్తే అవకాశముందని గ్రహిస్తే సత్వరమే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఉపాధిహామీ పథకం కింద అర్హులైన వారందరికీ జాబ్ కార్డులు అందించాలన్నారు. మండలంలోని నిమ్మనపల్లిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు.

తాగునీటికి ఇబ్బంది కలగనివ్వం



బావిని పరిశీలిస్తున్న కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: వేసవిలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ తెలిపారు. పట్టణంలోని సుగ్లాంపల్లి రక్షిత మంచినీటి బావిని సోమవారం ఆయన పరిశీలించారు. కాలనీవాసులకు తాగునీరు సరఫరా చేసేటప్పుడు తప్పనిసరిగా బ్లీచింగ్ పౌడర్ వేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఐక్య పోరాటాల సారథి రణదివే

జ్యోతినగర్: ఐక్య పోరాటాల సారథి రణదివే అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భిక్షపతి అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీ యూనియన్ కార్యాలయంలో సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు రణదివే వర్ధంతి సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్మిక రాజ్యస్థాపన లక్ష్యంగా శ్రమదోపిడీ, సామాజిక అణచివేతలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను ముందుకు తీసుకు పోవాలని ఆయన కోరారు. జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, శంకర్, రాజ్‌కుమార్, మల్లేశ్, శ్రీనివాస్, నాగభూషణం పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో పీఎం ఫొటో పెట్టాలి



సన్నబియ్యం పరిశీలిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రేషన్ దుకాణాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలని కాలనీ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. యైటింక్లయిన్‌కాలనీ రేషన్ షాపుల్లో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని సోమవారం వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు ఇస్తున్న 6కిలోల బియ్యంలో కేంద్రం 5కిలోలు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో బియ్యం మాత్రమే ఇస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో పీఎం చిత్రపటం పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీపేట శివాజీ, జిల్లా నాయకులు మూకిరి రాజు, శశి కుమార్, దాసరి శ్రీనివాస్, లింగం నాయక్, శ్రీనివాస్, వెంకటి, పాషా, నాగేందర్, కుమార్, ఓదెలు, పూర్ణ పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణించాలి

జూలపల్లి: ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి సరస్వతి సూచించారు. మండలంలోని ఆదర్శ విద్యాలయంలో సోమవారం ప్రిన్సిపాల్ షాదుల్ అధ్యక్షతన జెండర్, ఈక్విటీ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, లక్ష్మి, పీసీ మరియమ్ పాల్గొన్నారు.

ఓదెలలో ఈదురుగాలులు

ఓదెల: మండలంలో ఈదురుగాలులకు సోమవారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండలంలోని ఓదెల, కొలనూర్, హరిపురం, ఉప్పరపల్లె, గోపరపల్లె గ్రామాల్లో అకస్మాత్తుగా బలమైన ఈదురుగాలులకు చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో గంటసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది.

మహమ్మాయిదేవి బ్రహ్మోత్సవాలకు వేళాయే

- 8 నుంచి 12 వరకు ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు చేసిన ఉత్సవ నిర్వాహకులు



మహమ్మాయి దేవి అమ్మవారు



ఆలయం ఎదుట చలువ పందిళ్లు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం చిన్నకల్వలలో క్రీస్తు పూర్వం 227లో స్వయంభూగా వెలసిన చరిత్ర కలిగిన శ్రీమహమ్మాయిదేవి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి 12వ తేదీ వరకు జరగనున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే తల్లి మహమ్మాయిదేవి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లిస్తారు.

ఐదురోజుల పాటు ఉత్సవాలు..

ఏప్రిల్ 8 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. 8న గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, శ్రీఉమామహేశ్వర స్వాముల వారి కల్యాణ మహోత్సవం, 9న సహస్రనామ పూజలు, కుంకుమార్చనలు, హోమం, బలిహరణం, భజనలు, 10న గురువారం సహస్రనామ పూజలు, అర్చనలు, భేరి అర్చన, మంత్రపుష్పం, సాంస్కృతిక కార్యక్రమాలు, 11న కుంకుమార్చనలు, బలిహరణం, తీర్థప్రసాద వితరణ, 12న మహా పూర్ణాహుతి హోమం, శ్రీహనుమాన్ జయంతి, మహాపడి నైవేద్య నివేదన కార్యక్రమం, పల్లకిసేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు..

మహమ్మాయిదేవి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లిస్తారు. ఈ సందర్భంగా చలువ పందిళ్లు, క్యూలైన్లు, చలివేంద్రాలు, అన్నదానం కోసం నూతనంగా షెడ్డు ఏర్పాటుతో పాటు అన్ని వసతులు కల్పించినట్లు ఉత్సవ నిర్వాహకులు దేవరకొండ కృష్ణమాచార్యులు తెలిపారు.



కమాన్‌పూర్: మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి మండల కేంద్రానికి, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు చేటు చేసుకోగా అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. అయితే అదే దారిపై మళ్లీ పగుళ్లు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ అండ



పరీక్షలు చేస్తున్న ఎన్టీపీసీ డాక్టర్లు

జ్యోతినగర్: బాలికా సాధికారతకు ఎన్టీపీసీ సంస్థ అండగా ఉందని ప్రాజెక్టు ఏజీఎం(హెచ్ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఆడిటోరియంలో బాలికా సాధికారత మిషన్-2025లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు వేసవిలో శిక్షణ అందించేందుకు సోమవారం ఆరోగ్య పరీక్షల శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2019లో మొదటిసారి బాలికా సాధికారత వేసవి శిక్షణను బాలికలకు అందించినట్లు తెలిపారు. శిక్షణ సమయంలో బాలికలకు పోషకాహారంతో కూడిన భోజనం, ఇంగ్లీషు, హిందీ వ్యాకరణం, కంప్యూటర్ అక్షరాస్యత, గణితం, సైన్స్, జీవిత నైపుణ్యాలు, నృత్యం, కరాటే, యోగాతో పాటు పలు అంశాలపై ఉత్తమ ఉపాధ్యాయులతో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. 2025లో నాలుగు మండలాల నుంచి 194 మంది బాలికలు ఆరోగ్య పరీక్షల్లో పాల్గొన్నారు. వీరిలో 120 మందిని వేసవి శిక్షణ నిమిత్తం ఎంపిక చేసి 28 రోజులు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అధికారులు, సీఎస్సార్ ప్రతినిధులు, డాక్టర్లు, బాలికలు పాల్గొన్నారు.

మానేరులో వంతెన నిర్మాణానికి కృషి



ప్రతిజ్ఞ చేయిస్తున్న దుద్దిళ్ల శ్రీనుబాబు

ముత్తారం: మండలంలోని శాత్రాజుపల్లి వెళ్లడానికి మానేరులో లెవల్ వంతెన నిర్మాణానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో కృషి చేస్తానని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల శ్రీనుబాబు అన్నారు. మండలంలోని పారుపల్లిలో సోమవారం రాత్రి జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, మహాత్మాగాంధీ ఆశయాలను గౌరవించాలని కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి చేతి పంపులు వేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మహిళా మండల అధ్యక్షురాలు గోవిందుల పద్మ, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, సింగిల్‌విండో చైర్మన్ యాదగిరిరావు, వైస్‌చైర్మన్ ఎలుక కొమురయ్య, నాయకులు ఎడవేన సంపత్, కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీమా యోజన పథకాలను వినియోగించుకోండి



చెక్కు అందజేస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ: ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) జె.అరుణశ్రీ సూచించారు. ఇటీవల మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు కొట్టె ప్రసాద్ మరణించాడు. కాగ అతడి కుటుంబానికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద ఎస్‌బీఐ లైఫ్ బీమా సంస్థ జారీ చేసిన రూ.2లక్షల చెక్కును నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఈ బీమా పథకాల్లో పారిశుధ్య కార్మికులు, ఆర్పీలు ప్రతీఒక్కరు చేరాలన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, సిబ్బంది వసుధ, శంకర్, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, లింగయ్య, రాయమల్లు, రాజేందర్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయండి



ఆందోళన చేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియా సింగరేణి యజమాన్యం ఆధ్వర్యంలో నిర్మించిన ఓసీపీ- 3 సీహెచ్‌పీ నుంచి పోతనకాలనీ మీదుగా ఓసీపీ-1 సైలో బంకర్ నుంచి రామగిరి మండలంలోని సెంటినరీకాలనీ వైపు వెళ్లే ప్రధాన కోల్ కారిడార్ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి కోరారు. కోల్ కారిడార్ రోడ్డుపై ఎక్కువగా గుంతలు ఏర్పడినట్లు కార్మికులు తెలపడంతో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రోడ్డుపై నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొంతకాలం నుంచి రోడ్డు పూర్తిగా ధ్వంసమవడంతో విధులకు వెళ్లే సింగరేణి కార్మికులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సింగరేణి యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రోడ్డును పునర్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గోదావరిఖని నుంచి సెంటినరీకాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా వీధి దీపాలతో పాటు డివైడర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల కార్మికులతో కలిసి ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వినయ్, ప్రవీణ్‌కుమార్, వెంకన్న, వినేశ్, శ్రావణ్, సునీల్, రాకేశ్, సంతోష్, మల్లికార్జున్, రాకేశ్ పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిపై బాధ్యతగా వ్యవహరిస్తాం



ప్రాజెక్టు అధికారిని సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ అభివృద్ధిపై తమ యూనియన్ బాధ్యతతో ముందుకు సాగుతుందని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి అన్నారు. ఓసీపీ-3 నూతన ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్‌తో సోమవారం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉత్పత్తి లక్ష్యాలు పెంచిన క్రమంలో జీవిత కాలం ముగిసిన యంత్రాల స్థానంలో నూతన గ్రేడర్లు, డోజర్లు, డీజిల్ బోజర్లు, ట్యాంకర్లను కొనుగోలు చేయాలని కోరారు. రక్షణ విషయంలో రాజీలేకుండా ముందుకు సాగాలన్నారు. వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనలో తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్, నాయకులు ఐ.సత్యం, బేటి చంద్రయ్య, శ్రీనివాసరెడ్డి, రవీందర్‌రెడ్డి, చెలుపూరి సతీశ్, మామిడి తిరుపతి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చేస్తాం.. దరఖాస్తులు ఇవ్వండి

సుల్తానాబాద్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు నేరుగా ఎంపీడీవో కార్యాలయంలో ఇవ్వాలని ఎంపీడీవో నీలగిరి దివ్య దర్శన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. కార్యాలయాల్లో అందజేస్తే సిబ్బంది వాటిని ఆన్‌లైన్ చేస్తారని వివరించారు. వాటికి కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, ఫొటో, బ్యాంకు అకౌంట్ నంబర్ జిరాక్సులను జతచేసి ఇవ్వాలని కోరారు. 14వ తేదీ లోగా కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లిలో ర్యాలీ



ఎలిగేడు మండల కేంద్రంలో ర్యాలీ

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గర్రెపల్లిలో ర్యాలీ నిర్వహించారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి నిస్సీ క్రిస్టీనా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ పీటీఎస్ ధన్వంతరీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల ఆహారం తీసుకోవాలని డాక్టర్ లక్ష్మీవాణి సూచించారు.

పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ సర్కార్ పేదలందరికీ సన్నబియ్యం అందించి అన్నివర్గాల వారికి న్యాయం చేసిందని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అన్నారు. మండలంలోని వెన్నంపల్లి, మంగపేట, జాఫర్‌ఖాన్‌పేట గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో అర్హులందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు కలీమొద్దీన్, రమేశ్, మల్లయ్య, శంకరయ్య, శ్రావణ్ పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని రామయ్యపల్లిలో సన్నబియ్యం పంపిణీని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కోట మహేందర్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అరిగె లింగయ్య, లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ పోసుదాసరి సంతోష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, మాజీ ఉపసర్పంచు పంజాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అల్వాల రాజేశం, నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురికి అంబులెన్స్ అందజేత



అంబులెన్స్ అందిస్తున్న సేవా సదన్ సభ్యులు

మంథని: ధర్మపురి ప్రజల సేవ నిమిత్తం నూతన అంబులెన్స్‌ను మంథనిలోని శ్రీసీతారామ సేవాసదన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు సోమవారం ఉచితంగా అందించారు. ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి దుద్దిళ్ల గణపతి, కోశాధికారి అంబరీశ్ రావు, సంయుక్త కార్యదర్శి పల్లి ప్రహ్లాద్, కార్యవర్గ సభ్యులు సువర్ణ మహదేవ్, గట్టు ప్రదీప్, ప్రముఖ న్యాయవాది శశిభూషణ్ కాచే పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ జంగాలపల్లెలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కొడుకు ప్రతీక్ యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేశారు. ఐదో డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి రవి, గట్టయ్య, యువజన నాయకులు జూల అవినాష్, రాజేశం, ఉదయ్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది సమ్మె నోటీసు అందజేత

జూలపల్లి: గ్రామ పంచాయతీల్లో చాలీచాలని వేతనంతో మల్టీపర్పస్ కార్మికులుగా పని చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డికి పంచాయతీ సిబ్బంది సోమవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మిక సంఘం నాయకుడు సంపత్‌కుమార్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు కోరామని, ఈ నెల 19లోపు సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని పేర్కొన్నారు. బాణయ్య, భాస్కర్, చంద్రమౌళి, హన్మయ్య, కొండయ్య, నర్సింగం, ప్రశాంత్, ఆంజనేయులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాలకుర్తి: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. మండలంలోని బసంత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక పంచాయతీ కార్మికులతో కలిసి సోమవారం ఎంపీడీవో రామ్మోహన్, ఎంపీవో సుదర్శన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్మికుల సమస్యల పరిష్కరించకపోతే ఈనెల 19 నుంచి సమ్మె చేపడతామని తెలిపారు. పంచాయతీ కార్మికులు కట్ల స్వామి, బూడిద రామస్వామి, ఎండీ.రఫీ, స్వరూప, కుక్క అనిల్ పాల్గొన్నారు.

19 నుంచి నిరవధిక సమ్మె

ధర్మారం: పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్‌చేస్తూ 19 నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటామని సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం మండల పంచాయతీ అధికారి రమేశ్‌కు నోటీసు అందించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆకుల రాజయ్య, ప్రధాన కార్యదర్శి ఎదుల్ల రవికుమార్, రాగుల మల్లేశం, నాయకులు కుమార గంగాధర్, దేలానాయక్, శ్రీనివాస్, విజయ, రమణాచారి, రాజేశం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారుల ఫోకస్



ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని వివిధ గ్రామాల శివారులో ప్రధాన రహదారులు, కీలక ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణ చర్యలకు రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బ్రహ్మణపల్లి, సోమనపల్లి, లింగాపూర్, పొట్యాల, కుందనపల్లి గ్రామాల్లో ముఖ్య ప్రదేశాల్లోని ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 2,696 ఎకరాలు ప్రభుత్వ భూమి గుర్తించగా అందులో అత్యధిక శాతం రాయదండిలో 2,037.17 ఎకరాలు ఉన్నాయి. గుర్తించిన ప్రభుత్వ భూములు 126.31 ఎకరాలకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, దశలవారీగా అన్ని ప్రభుత్వ భూముల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి దానిపై సర్వే నెంబర్ వివరాలు పొందుపరిచామని పేర్కొన్నారు. మలివిడతలో మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి కంచె ఏర్పాటు చేస్తామని అంతర్గాం తహసీల్దార్ తూమ్ రవీందర్‌పటేల్ తెలిపారు. రెవెన్యూ పరిశీలకులు శ్రీమాన్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• మహిళపై దాడి.. కేసు నమోదు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన సాతిని అలియాస్ తోట లక్ష్మిపై సమీప బంధువులే దాడి చేయడంతో గాయాలయ్యాయని బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. ఆదివారం రాత్రి సమయంలో లక్ష్మికి చెందిన విద్యుత్ వైరును పొరుగున ఉండే వారి బంధువులు శంకరయ్య, కనకమ్మ తెంపేశారని ఎస్సై తెలిపారు. ఈ విషయమై వారిని నిలదీయగా ఇనుపరాడ్‌తో కొట్టగా తలకు గాయమైందని, వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారని పేర్కొన్నారు. గాయపడ్డ లక్ష్మి సోదరుడు సాతిని మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

• అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ

ఎలిగేడు: మండల కేంద్రంలో బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సోమవారం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కవ్వంపెల్లి చంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా ఇరుగురాళ్ల సదానందం, కార్యదర్శిగా మల్లారపు మహేందర్, సర్వేషం, జాయింట్ సెక్రటరీగా అసంపెల్లి శంకర్, ప్రచార కార్యదర్శిగా కాంపెల్లి రమేశ్, అసంపెల్లి శ్రీనివాస్, రాచర్ల అనిల్, సాయిలు, అజయ్, సభ్యులుగా మనోజ్, సచిన్, ప్రకాశ్, శ్రీనివాస్, శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రధాన డ్రైనేజీలో మురుగు తొలగింపు



మురుగు తొలగిస్తున్న సిబ్బంది

రామగుండం: కార్పొరేషన్ 22వ డివిజన్ రామగుండం పట్టణ పరిధిలోని ప్రధాన డ్రైనేజీలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది జేసీబీ సాయంతో సోమవారం మురుగు తొలగిస్తున్నారు. దశాబ్దాల క్రితం బండరాళ్లతో నిర్మించిన డ్రైనేజీ కావడంతో జేసీబీతో మురుగు తొలగించే క్రమంలో శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ బండరాళ్లు కూలిపోతున్నాయి. దీంతో అందులోకి మట్టి కూలి మురుగు మరింతగా ఎక్కడికక్కడ నిలిచిపోయే అవకాశం ఉంది. డ్రైనేజీలో తొలగించిన మురుగును ట్రాక్టర్‌లో లోడ్ చేసి తరలించే క్రమంలో రోడ్డుపై మురుగు పడి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.